



# కరపత్రం

SINCE 2014

సోమవారం ఆగస్ట్ 24, 2026 | సంపుటి : 2 | సంచిక : 313 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## లండన్ పర్యటన ముగించుకున్న రేవంత్

- కొన్ని గంటల్లో హైదరాబాద్‌కు వస్తా: రేవంత్
- అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ
- రాజకీయ కారణాలేనని సీఎం ఆరోపణ
- హైదరాబాద్ వచ్చాక అన్ని అంశాలపై మాట్లాడతా



రాజకీయ కోణంలోనే తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అనుమతి నిరాకరణ నేపథ్యంలో అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు 'ఎక్స్'లో రేవంత్ పోస్ట్ పెట్టారు."రాజకీయ కారణాల రీత్యా నా అమెరికా పర్యటనకు విదేశీ వ్యవహారాల శాఖ అనుమతి నిరాకరించింది. ఈ నేపథ్యంలో అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నా. విదేశీ పర్యటన అంశంలో నాకు మద్దతుగా నిలిచిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కృతజ్ఞతలు. లండన్ పర్యటనను విజయవంతంగా ముగించుకున్నాను. మరికొన్ని గంటల్లో హైదరాబాద్‌కు వస్తున్నా. అక్కడికి వచ్చాక మిగిలిన అంశాలపై మాట్లాడతా. గత మూడు రోజులుగా పార్టీ, నేతలు, ప్రజల నుంచి లభించిన అద్భుతమైన మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ దగాపై సమరభేరి

» వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులైనా నెరవేర్చలేదు

» సెప్టెంబర్ 2 నుంచి వారం రోజులపాటు నిరసన కార్యక్రమాలు : కేటీఆర్

**హైదరాబాద్:**
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఆ పార్టీ ఇచ్చిన హామీలు, పాలనా వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ సమరభేరికి సిద్ధమైంది. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలను కలుస్తూ వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీ సభ్యులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.



2లో..



## హద్దులు దాటితే ఉపేక్షించం

- కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్య స్వేచ్ఛ ఎక్కువ
- క్రమశిక్షణ ఉల్లంఘనను సహించబోమని స్పష్టం
- నేతల సమస్యలు పార్టీ వేదికపైనే చెప్పాలి
- అంతర్గత విషయాలు బహిరంగంగా మాట్లాడొద్దని హితవు
- కొండా సురేఖ ఎపిసోడ్‌పై టీపీసీసీ చీఫ్ స్పందన

**నిజామాబాద్ జిల్లా:**
కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ.. కానీ హద్దులు ఉల్లంఘిస్తే ఎంత పెద్దవారినైనా ఉపేక్షించం" అంటూ టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన కొండా సురేఖ ఎపిసోడ్‌పై స్పందిస్తూ.. ప్రతి పార్టీలో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఉంటుందని.. కాంగ్రెస్ పార్టీలో మరింత ఎక్కువ స్వేచ్ఛ ఉంటుందన్నారు. అయితే, క్రమశిక్షణ ఉల్లంఘించి మాట్లాడితే సహించబోమన్నారు.నేతలకు ఇబ్బందులు ఉంటే పార్టీ వేదికలపై మాట్లాడాలని.. అంతర్గత విషయాలు బహిరంగంగా మాట్లాడటం సమంజసం కాదని మహేష్ గౌడ్ హితవు పలికారు. కాగా, నిజామాబాద్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని తపనతో ముందుకు వెళ్తున్నామన్న మహేష్ గౌడ్.. జిల్లా అభివృద్ధి గతంలో కాంగ్రెస్ హయంలో జరిగిందన్నారు.వైఎస్సార్ హయంలో తెలంగాణ యూనివర్సిటీ వచ్చింది. కొత్తగా అధికారంలోకి వచ్చాక ఇంజనీరింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాల తీసుకొచ్చాం. రాష్ట్రంలో అత్యధికం ఇందిరమ్మ ఇళ్లు జిల్లాలో ఇచ్చాం. హైదరాబాద్ మాదిరి నిజామాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఇందిరమ్మ టవర్స్ చేపట్టినట్లు మహేష్ గౌడ్ అన్నారు.

2లో..



## 'అద్భుతమైన జెన్ జీ ముఖాలు'.. సీజేపీ సౌరవ్ దాస్ సెటైర్లు

**న్యూఢిల్లీ:**
దేశంలోని జెన్ జీకి చేరువయ్యేందుకు బీజేపీ మొదలు పెట్టిన కార్యక్రమం, అందుకోసం ఎంపిక చేసిన నేతలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆదివారం విమర్శలు చేసింది. "అద్భుతమైన జెన్ జెడ్ ముఖాలను ఎంపిక చేసిన బీజేపీకి మూడు చప్పట్లు" అంటూ ఎక్స్‌లో కాక్రోచ్ జనతా పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ సెటైర్లు వేశారు.

2లో



## అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు బంద్

**హైదరాబాద్:**
రాష్ట్రంలో ( ఆదివారం) అర్ధరాత్రి నుంచి ఆటోల బంద్ చేపట్టనున్నట్లు ఆటో డ్రైవర్లు ప్రకటించారు. ఈ సమ్మె రాష్ట్రవ్యాప్తంగా ఉండనున్నట్లు తెలిపారు. ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ బంద్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రేపు సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



2లో

## కొండా సురేఖకు ఓబీసీ సంఘం అండ

» బీసీ మంత్రి కావడంతోనే కుట్రలంటూ ఆరోపణ
» కుమార్తె వ్యాఖ్యలపై నోటీసులివ్వడంపై ఆగ్రహం
» ఇతర నేతలకు నోటీసులెందుకివ్వలేదని ప్రశ్న
» అన్యాయం జరిగితే రాహుల్ ఇంటి ముట్టడికి హెచ్చరిక
» రెండో లేఖపై సమీక్షిస్తాం: మల్లు రవిద

**హైదరాబాద్:**
తెలంగాణ మంత్రి కొండా సురేఖకు ఆలిండియా ఓబీసీ సంఘం మద్దతు ప్రకటించింది  కొండా సురేఖకు అండగా ఉంటామని స్పష్టం చేసింది.

## 10 రోజులైనా లోక్‌సభను ఎందుకు ప్రోరోగ్ చేయలేదు: కాంగ్రెస్

**ఢిల్లీ:**
లోక్‌సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 10 రోజులు గడిచినప్పటికీ.. ఇప్పటికీ సభను ప్రోరోగ్ చేయకపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టింది.



2లో..

## 'చిన్నారెడ్డి వివరణతో సంతృప్తి చెందలేదు'



హైదరాబాద్:
తనపై చేసిన వ్యాఖ్యలకు గాను చిన్నారెడ్డి ఇచ్చిన వివరణతో తాను సంతృప్తి చెందలేదని వనపర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేఘారెడ్డి. స్పష్టం చేశారు. చిన్నారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రమశిక్షణ కమిటీకి ఆడియో, వీడియో సమర్పించినట్లు ఆయన తెలిపారు. మళ్లీ కమిటీ పిలిస్తే తన వర్షన్ చెబుతానన్నారు.

## 14 దేశాలకు టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుల నియామకర



**హైదరాబాద్:**
విదేశాల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ బలోపేతం కోసం 14 దేశాల్లో పార్టీ అధ్యక్షులను నియమించినట్టు ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వీరిలో కిశోర్ కత్తి (ఆస్ట్రేలియా), సుమన్‌రావు బల్మూరి (యూకే), వెంకట్రామన్ మెట్‌పల్లి (కెనడా), తానింకి కిశోర్ యాదవ్ (ఇటలీ), పింటూ ఘోష్ (మాల్టా), ప్రకాశ్ పొన్నకంటి (పోర్చుగల్), శేఖర్ గౌడ్ ఆరె (యూఏఈ), మార్క ప్రమోద్ గౌడ్ (కువైట్), బెమ్మడి మహేందర్ రెడ్డి (జింబాబ్వే), శేఖర్ చిలువూరి (ఖతార్), సందీప్ రెడ్డి ఐరెడ్డి (ఫిన్లాండ్), ప్రసాద్‌రావు బిక్కినేని (నార్వే), మొజ్జం అలీ ఇఫ్తేకర్ (సౌదీ అరేబియా), జయంత్ రెడ్డి మెట్టు (ఐర్లాండ్) వీరితోపాటు మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా సుల్గే శ్రీనివాస్‌ను నియమించినట్టు పేర్కొన్నారు.




## స్వర్ణం గెలిచిన శ్రీనిత్య

**హైదరాబాద్:**
జాతీయ జూనియర్ స్విమ్మింగ్ పోటీల్లో చివరిరోజు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్లు మెరిపించారు. మొత్తం నాలుగు పతకాలు సాధించారు. తెలంగాణ అమ్మాయి సాగి శ్రీనిత్య స్వర్ణ పతకం సాధించగా... మైలారి సుహాస్ ప్రీతమ్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు.
సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్ఎస్‌సీబీ)కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అబ్బాయి మొంగం తీర్థ సామదేవ్ రజత పతకం నెగ్గగా... ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మొంగం యజ్ఞసాయి కూడా రజత పతకాన్ని గెల్చుకున్నాడు. మహిళల 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో శ్రీనిత్య 2 నిమిషాల 24.59 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానంలో నిలిచింది. ప్రియాన్షి మిశ్రా (కర్ణాటక; 2ని:29.13 సెకన్లు) రజతం, మీనాక్షి మేనన్ (కర్ణాటక; 2ని:31.99 సెకన్లు) కాంస్యం గెలిచారు.
పురుషుల 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో తీర్థ సామదేవ్ (2ని:06.45 సెకన్లు) రెండో స్థానంలో... సుహాస్ ప్రీతమ్ (2ని:06.62 సెకన్లు) మూడో స్థానంలో నిలిచారు. పురుషుల 800 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో యజ్ఞసాయి (8ని:41.46 సెకన్లు) రెండో స్థానాన్ని సంపాదించాడు.

## ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి.. ఒకరోజు ముందే యూట్యూబ్‌లో వీడియో పెట్టిన తల్లి

**ఇంటర్నెట్ డెస్క్:**
మహారాష్ట్ర లోని ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలో ఇటీవల ఐ ఫోన్ వివాదమై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు ఒకరోజు ముందు యువకుడి తల్లి సంగీత తన యూట్యూబ్ ఛానల్‌లో పెట్టిన వీడియో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



2లో..

## నాణ్యమైన యూనిఫారాలు కూడా ఇవ్వలేరా?

- ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫారాలపై హరీశ్‌రావు

హైదరాబాద్:
ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాముమని చెబుతున్న ప్రభుత్వం.. ప్రభుుత్వ పాఠశాలల విద్యార్థులకు కనీసం నాణ్యమైన యూునిుఫారాలు కూడా అందించలేని దుస్థిుతిలో ఉందుని మాజీమంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. 'ఊడుున కుట్లు.. కొలతల పాట్లు'అనే శీర్షికతో ఆదివారం 'సాక్షి'ప్రధాన సంచికలో వచ్చిన కథనాన్ని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో యూనిఫారాలు అందులేదని, అందిన చోట్ల కూడా కొలతలు సరిగ్గా లేకపోముడంతోపాటు కుట్లు ఊడుుపోతున్నాయని ఆరోపించారు. ఉతికితే రంగులు వెలిసిపోతున్నాయన్నారు.



కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఆగస్ట్ 24, 2026

# నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు

- జమాత్ ఏ అహ్లే హదీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





**కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 22**
వరంగల్: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జమియత్ అహ్లే హదీస్ వరంగల్ ఆధ్వర్యంలో అర్హులైన నిరుపేదల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.శిబిరంలో నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షించి,అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమానికి అంతిజర్‌గంజ్ సీఐ ముహమ్మద్ అబ్దుల్ షకూర్,డీసీసీ అధ్యక్షుడు ముహమ్మద్ అయూబ్,మిర్జా అజీజ్ బేగ్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పేద కుటుంబాలకు వైద్య అవగాహన కల్పించడంతో పాటు ఉచిత వైద్యం, మందులు అందించడం అభినందనీయమన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.మానవ సేవే మాధవ సేవ అని పేర్కొన్నారు.జమియత్ అహ్లే హదీస్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ మదానీ,సాబిర్ నాయర్,మహమ్మద్ అబ్దుల్లా,నయీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.ఈ శిబిరం ద్వారా 300 మందికి పైగా నిరుపేదలు లబ్ధి పొందారు.

# అజాంజాహి మిల్లు మాజీ కార్మికుల సమస్యపై సమావేశం



**కరపత్రం ప్రతినిది వరంగల్ జిల్లా,ఆగస్టు 23**
సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అజాంజాహి మిల్లు మాజీ కార్మికుల సమస్య పరిష్కారంపై శనివారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులు,పిటిషనర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,హనుమకొండ జిల్లా కలెక్టర్,కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు.సమస్య పరిష్కారానికి ఉన్న ప్రత్యామ్నాయాలపై తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు మాజీ కార్మికులు కొంత సమయం కోరినట్లు కలెక్టర్ తెలిపారు.కార్మికుల అభిప్రాయాలు అందిన అనంతరం మరోసారి సమావేశం నిర్వహించి,తదుపరి చర్యలు చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.సంధ్యారాణి,కుడా సీపీఓ అజిత్ రెడ్డి,డీఆర్వో విజయలక్ష్మి,అజాంజాహి మిల్లు మాజీ కార్మికులు పాల్గొన్నారు.

# శివ ఆయుర్వేదిక్ స్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం






**కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 22**
శివ ఆయుర్వేదిక్ స్పెషాలిటీ క్లినిక్ 1వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాశీబుగ్గ శ్రీనివాస స్ట్రీట్,తిలక్ రోడ్‌లోని క్లినిక్ ఆవరణలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరీక్షించి,అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్య విధానంపై ఆరోగ్య సూచనలు,సలహాలు అందించారు.శిబిరానికి 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.డివిజన్‌కు చెందిన ప్రజలు కూడా శిబిరంలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.వైద్య బృందంలో డాక్టర్ బూర శివ,డాక్టర్ కె.నిఖిల,డాక్టర్ టి.ఎల్.గాయత్రి పాల్గొన్నారు.మందులను డాక్టర్ కె.అంజిరెడ్డి స్పాన్సర్ చేశారు.శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు ఆర్.కీర్తి కుమార్, జి.హరిహరన్,బి.మణిదీప్,డి.సందీప్,సి.ప్రశాంత్ సహకరించారు.ఒక సంవత్సరం పాటు అందించిన వైద్య సేవలకు గుర్తుగా నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

# టీచర్లకు రక్షణ కల్పించాలి

- రూపారెడ్డి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సుందర్‌రాజ్ యాదవ్

**కరపత్రం ప్రతినిది హనుమకొండ,ఆగస్టు 23**
నల్గొండ జిల్లా నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తూ హనుమకొండలో ప్రైవేట్ స్కూల్ టీచర్లు శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.అదాలత్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు చేపట్టిన ర్యాలీలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు,ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాస్టర్ జీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్,కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. రూపారెడ్డి కుటుంబానికి సంఘీభావంగా నిరసన ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు.తల్లిదండ్రుల తర్వాత గురువులను దైవంగా భావిస్తామని,అలాంటి ఉపాధ్యాయులకే రక్షణ లేకపోవడం బాధాకరమన్నారు.ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఒక్కరోజు స్పందించి వదిలేయకుండా,కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.భవిష్యత్తులో ఏ ఉపాధ్యాయుడికీ రూపారెడ్డి పరిస్థితి రాకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ప్రైవేట్ పాఠశాలల పరిరక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావడంతో పాటు రూపారెడ్డి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.ప్రైవేట్ పాఠశాలలు,ఉపాధ్యాయులపై దాడులు జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో వాడుప్సా నాయకులు ఎన్.రమేష్,ఎన్.నారాయణరెడ్డి,నాగార్జునరెడ్డి,సతీష్‌కుమార్,జ్ఞానేశ్వర్,ముక్తేశ్వర్,శ్రీధర్,జి. రమేష్,రాంబాబు,శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# షహీద్ షోయబుల్లా ఖాన్ త్యాగం స్ఫూర్తిదాయకం

- ఆవాజ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో.. వర్ధంతి వేడుకలు



**కరపత్రం ప్రతినిది వరంగల్, ఆగస్టు 23**
తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన నిర్భయ పాత్రికేయుడు షహీద్ షోయబుల్లా ఖాన్ 78వ వర్ధంతిని ఆవాజ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆవాజ్ కార్యాలయంలో జిల్లా నాయకులు తాహిర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహమ్మద్ రహీమ్ ఖాన్ పాల్గొని షోయబుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్ రహీమ్ ఖాన్ మాట్లాడుతూ.. నిజాన్ని నిర్భయంగా రాసిన కలం యోధుడు షోయబుల్లా ఖాన్ అని కొనియాడారు. 1920 అక్టోబర్ 17న ఖమ్మం జిల్లా సుబ్రవేడు గ్రామంలో జన్మించిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో బీఏ, జర్నలిజం విద్యను అభ్యసించారని తెలిపారు. పాత్రికేయుడిగా 'తేజ్' ఉర్దూ పత్రికలో ఉపసంపాదకుడిగా ప్రస్థానం ప్రారంభించిన షోయబుల్లా ఖాన్, అనంతరం మందుముల నర్సింగరావు నిర్వహించిన 'రయ్యత్' పత్రికలో పనిచేశారని చెప్పారు. ఈ రెండు పత్రికలను నిజాం ప్రభుత్వం నిషేధించడంతో తన భార్య, తల్లి నగలను విక్రయించి 'ఇమ్రోజ్' అనే ఉర్దూ పత్రికను ప్రారంభించారని పేర్కొన్నారు. 'ఇమ్రోజ్' ద్వారా నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలు, ఖాసిం రజ్వీ క్రూరత్వాన్ని షోయబుల్లా ఖాన్ నిర్భయంగా ఎండగట్టారని తెలిపారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలని ఆయన బలంగా వాదించారని అన్నారు. షోయబుల్లా ఖాన్ రాతలను సహించలేని రజాకార్లు 1948 ఆగస్టు 22న అర్ధరాత్రి కాచిగూడలోని 'ఇమ్రోజ్' కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తున్న ఆయనపై దాడి చేసి హత్య చేశారని రహీమ్ ఖాన్ తెలిపారు. ఆయన కుడిచేతిని నరికివేశారని పేర్కొన్నారు. షోయబుల్లా ఖాన్ త్యాగం హైదరాబాద్ విమోచన ఉద్యమానికి మరింత స్ఫూర్తి నిచ్చిందని అన్నారు. ఆయన జీవితం, త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను సమాజం గుర్తుంచు కోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు తాహిర్, సుభాని, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో, క్యాబ్ డ్రైవర్ల పోరాటానికి ఎంపీ ఈటల రాజేందర్ మద్దతు

- ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి ఏడు లక్షల కుటుంబాలను ఆదుకోవాలి
- 'కొట్లాడదాం... బ్రతుకుదాం... ఆత్మహత్యలు చేసుకోవద్దు' అంటూ డ్రైవర్లకు భరోసా
- మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్



**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, ఆగస్టు 23**
తెలంగాణ రాష్ట్రంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న తీవ్ర జీవన సంక్షోభంపై కేంద్ర మంత్రి హోదాలో మాజీ మంత్రి, ఎంపీ ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. షామీర్‌పేట్‌లోని తన నివాసంలో తెలంగాణ రాష్ట్ర ఆటో మరియు యాప్ ఆధారిత డ్రైవర్ల సంఘాల జేఏసీ ప్రతినిధులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. కేంద్ర కార్మిక సంఘం భారతీయ మజ్దూర్ సంఘ్ (బి ఎం ఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 23 అర్ధరాత్రి నుంచి చేపట్టనున్న ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ బంద్‌కు మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా ఓలా, ఉబెర్, రాపిడో వంటి యాప్ సేవల విస్తరణ, ఉచిత బస్సు ప్రయాణ పథకం వంటి పరిణామాలతో ఆటో డ్రైవర్ల జీవనం పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. కుటుంబ పోషణ కూడా భారంగా మారి, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, పాల బిల్లులు, వాహనాల ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.
పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఆశతో ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో చేర్పించినా, ఫీజులు చెల్లించలేక తరగతి గదుల్లో నిలబెట్టే పరిస్థితి ఆటో డ్రైవర్ల కుటుంబాలను తీవ్ర మనోవేదనకు గురిచేస్తోందన్నారు. వృద్ధ తల్లిదండ్రులకు భోజనం పెట్టలేని, ఇంటి అద్దె కూడా చెల్లించలేని స్థితికి వేలాది కుటుంబాలు చేరుకున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే 200 మందికిపైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వారి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో జీవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భర్తను కోల్పోయిన మహిళలు నాలుగు ఇళ్లలో పనులు చేస్తూ పిల్లలను పోషించాల్సిన దుస్థితి అత్యంత బాధాకరమని అన్నారు.
సమాజంలోని బలహీన వర్గాల కష్టాలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని సుమారు ఏడు లక్షల ఆటో, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాలను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు.
ఆటో, క్యాబ్ డ్రైవర్లు చేపట్టిన బంద్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించిన ఆయన, "కొట్లాడదాం... బ్రతుకుదాం... నిరాశకు లోనవ్వద్దు... ఆత్మహత్యలు చేసుకోవద్దు. మీ పోరాటానికి తెలంగాణ సమాజం, మేమంతా అండగా ఉంటాం" అని ఎంపీ ఈటల భరోసా ఇచ్చారు.

# ధర్మ టీచర్స్ యూనిట్ రాష్ట్ర విద్యా సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

- ఈ నెల 26న హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యా సదస్సు
- విద్యా వ్యవస్థను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి - విద్యారంగ సవాళ్లపై రాష్ట్ర స్థాయి చర్చ అవసరం: దామెర ఉపేందర్ మహారాజ్



**కరపత్రం ప్రతినిది హనుమకొండ, ఆగస్టు 23**
విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రభుత్వాల విద్యా విధానాలు, సామాజిక వర్గాలపై వాటి ప్రభావం వంటి కీలక అంశాలపై సమగ్ర చర్చ జరపాలనే లక్ష్యంతో 'ధర్మ టీచర్స్" యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా సదస్సు కరపత్రాన్ని ఆదివారం హనుమకొండ నయీమ్‌నగర్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ధర్మ టీచర్స్ యూనిట్ రాష్ట్ర కో-కన్వీనర్ దామెర ఉపేందర్ మహారాజ్ మాట్లాడుతూ.. దేశంతో పాటు తెలంగాణలో విద్యారంగం ఎదుర్కొంటున్న సంక్షోభ పరిస్థితులు, ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి, బడ్జెట్‌లో విద్యకు తగ్గుతున్న కేటాయింపులు, వాటి ప్రభావం ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్తుపై ఎలా పడుతోందనే అంశాలపై రాష్ట్ర విద్యా సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలు విద్యను సామాజికాభివృద్ధికి ప్రధాన సాధనంగా భావించి అధిక స్థాయిలో నిధులు కేటాయిస్తున్నప్పటికీ, మన దేశంలో విద్యారంగానికి తగిన ప్రాధాన్యం లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యపై పెట్టుబడులు తగ్గడం వల్ల సమాజం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందడం లేదని, ప్రభుత్వాలు విద్యారంగంపై అవలంబిస్తున్న విధానాలను ప్రజల ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా హక్కు పరిరక్షణ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం, సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల విద్యా అవకాశాల పరిరక్షణ వంటి అంశాలపై మేధావులు, విద్యావేత్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యాభిమానులు తమ అభిప్రాయాలు పంచుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర విద్యా సదస్సును విజయవంతం చేయడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యారంగ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని దామెర ఉపేందర్ మహారాజ్ పిలుపునిచ్చారు.

# వరంగల్ తూర్పులో కాంగ్రెస్ అంతర్గత విభేదాలు!

- కొండా దంపతులు బేషరతుగా క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్ నేతల డిమాండ్



**కరపత్రం ప్రతినిది వరంగల్, ఆగస్టు 23**
వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి కొండా సురేఖ, కొండా మురళి,సుస్మిత పటేల్‌పై తీవ్ర విమర్శలు చేశారు.యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరమేశ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు అనుచితమని,ఆమె బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.వరంగల్ తూర్పులో బీసీ నాయకులను అణగదొక్కుతూ,పార్టీ కోసం పనిచేస్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బీసీ నినాదాన్ని అడ్డుపెట్టుకుని తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ నాయకుడు నల్గొండ నరేష్ మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ విధానాల వల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు కొండా దంపతులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులను అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందుతున్నారని, తూర్పు నియోజక వర్గంలో బీసీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం జరుగుతోందని ఆరోపించారు.మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి సుస్మిత పటేల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కొమ్మాల జాతరలో కొండా మురళి పరకాల నుంచి సుస్మిత పటేల్ పోటీ చేస్తారని ప్రకటించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.వరంగల్ తూర్పులో కార్పొరేటర్ టికెట్లను ప్రకటించే అధికారం కొండా మురళికి ఎవరిచ్చారని ప్రశ్నించారు.కొండా సురేఖను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని నరేందర్ డిమాండ్ చేశారు.బీసీ కార్డును అడ్డుపెట్టుకుని చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.వరంగల్‌లో వారి రాజ్యాంగం నడుస్తోందని, కొండా దంపతుల వెంట ఉన్నవారు ప్రేమతో కాకుండా భయంతో ఉన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీ అధిష్ఠానం ఈ వ్యవహారంపై అధిష్ఠానం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

# శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని దంపతులు

- ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజంలో ఐక్యత, సేవాభావానికి ప్రతీకలు:ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 23**
హనుమకొండ స్నేహనగర్‌లోని ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డుపై నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నీలిమ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు హాజరైన వారు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.
ఆలయ అర్చకులు, నిర్వహణ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సేవాభావం, సత్సంకల్పాలను బలోపేతం చేయడంలో ఆలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు,